కొప్పుల విఠల్‌రెడ్డి

నల్లగొండ సభకు భారీగా తరలిరావాలి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 7: కృష్ణా నది జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకునేందుకు ఈనెల 13న నల్లగొండలో నిర్వహిస్తున్న భారీ బహిరంగసభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి కోరారు. మన్సూరాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కృష్ణ బేసిన్ ప్రాజెక్టులను కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డ్ (కేఆర్ఎంబీ)కు అప్పగించిన కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తెలంగాణ వ్యతిరేక విధానాలకు ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. కేఆర్ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులు వెళితే తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు. కృష్ణా ప్రాజెక్టుల కోసం జరుగుతున్న పోరాటానికి కుల సంఘాలు, మేదావులు, ప్రజలు మద్దతు తెలపాలన్నారు. ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి అవగాహన లేకపోవడంతోనే కృష్ణా నది జలాలు కేంద్ర పరిధిలోకి వెళ్తున్నాయని తెలిపారు. నల్లగొండలో జరిగే సభ బీఆర్ఎస్ కోసం కాదని ప్రజల కోసమని.. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన బహిరంగసభ విజయవంతం అవుతుందని తెలిపారు.

యూటర్న్‌కు.. 4 కి.మీలు..

జింకల పార్కు వద్ద ఏర్పాట్లు చేసుకున్న వీధి వ్యాపారులు

ఆటోనగర్ వరకు వెళ్లాల్సిందే..

- విజయవాడ ఎన్‌హెచ్‌పై వాహనదారుల నరకయాతన
- రోడ్డు దాటాలన్నా.. తిప్పలే..
- విస్తరణ పనులతో సమస్య మరింత రెట్టింపు
- ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టని ట్రాఫిక్ పోలీసులు
- నిత్యం రద్దీతో ప్రయాణికుల అవస్థలు

హయత్‌నగర్, ఫిబ్రవరి 7: హయత్‌నగర్‌లో జరుగుతున్న విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనుల వల్ల వాహనదారులు నరకయాతనకు గురవుతున్నారు. రోడ్డు విస్తరణ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల నిర్లక్ష్యం కారణంగా వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఫుట్‌పాత్ వ్యాపారులతో ట్రాఫికర్...

హయత్‌నగర్ నుంచి ఆటోనగర్ వరకు ఫుట్‌పాత్ వ్యాపారులు ప్రధాన రోడ్డు పక్కనే ఏర్పాట్లు చేసుకుని వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో అక్కడికి వచ్చిపోయే వారితోనూ ట్రాఫిక్ జామ్ సమస్య ఉత్పన్నమవుతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ పోలీసులు నామమాత్రపు చర్యలు తీసుకుంటుండడంతో వీధి వ్యాపారులు వాహనదారులకు తలనొప్పి తెచ్చిపెడుతున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు.

భాగ్యలత వద్ద రోడ్డును దాటలంటే..?

హయత్‌నగర్, ఆటోనగర్‌కు మధ్య భాగ్యలత వద్ద అయాన్ డిజిటల్ సెంటర్ వద్ద నిత్యం ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతుంటాయి. ఇక్కడికి వచ్చిపోయే విద్యార్థుల తల్లిదండ్రులు తమ వాహనాలను మరమ్మతులు జరుగుతున్న మెయిన్ రోడ్డు పైనే గంటల తరబడి నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. అయాన్ డిజిటల్ ఎగ్జామ్స్ జరుగుతున్న సమయంలో ట్రాఫిక్ పోలీసులకు పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు నానా తంటాలు పడుతున్నారు.

4 కిలోమీటర్లు వెళ్లేనే యూటర్న్ తీసుకోవాలి...

హయత్‌నగర్ నుంచి ఆటోనగర్ వరకు 4 కిలో మీటర్లు ప్రయాణిస్తేనే యూటర్న్ తీసుకోవాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. సాయిబాబా ఆలయం వద్ద, ఆర్టీసీ డిపో వద్ద, హైకోర్టు కాలనీ, జింకల పార్కు వద్దనున్న యూటర్న్‌లను ట్రాఫిక్ అధికారులు మూసి ఉంచడంతో వాహనదారులు చాలా దూరం ప్రయాణించి ఆటోనగర్ వద్ద యూటర్న్ తీసుకోవాల్సి వస్తుంది. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఏర్పడుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

యూటర్న్ కోసం ఆటోనగర్ వరకు వెళ్తున్నాం

హయత్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద నుంచి వెళ్తే నాలుగున్నర కిలోమీటర్లు వెళ్లి ఆటోనగర్ వద్ద యూటర్న్ తీసుకోని రావాల్సి వస్తుంది. వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా యూటర్న్స్ ఓపెన్ చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి.

– సామ తిరుమలరెడ్డి, మాజీ కార్పొరేటర్, హయత్‌నగర్ డివిజన్

రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి..

హయత్‌నగర్‌లో నేషనల్ హైవే విస్తరణ పనుల కారణంగా ట్రాఫిక్ జామ్ సమస్య ఏర్పడుతుంది. హయత్‌నగర్ డిపో, భాగ్యలత, జింకల పార్కు వద్ద యూటర్న్స్ వద్ద రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోతున్నాయి. దాంతో కొన్నిచోట్ల యూటర్న్స్ మూసివేయాల్సి వచ్చింది.

– శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ వనస్థలిపురం పోలీస్ స్టేషన్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, చిత్రంలో ట్రాఫిక్ పోలీసు అధికారులు

సెవెన్ సీటర్స్ ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి కృషి

హయత్‌నగర్, ఫిబ్రవరి 7: నియోజకవర్గంలో సెవెన్ సీటర్స్ ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీనిచ్చారు. బుధవారం కర్మన్‌ఘాట్ కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్స్ నందు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సెవెన్ సీటర్స్, ట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంతోష్‌నగర్, ఎల్బీనగర్ ట్రాఫిక్ ఏసీపీలు నవీన్‌రెడ్డి, సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలీసు ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆటోలు నడుపుకోవాలని సూచించారు. రోజురోజుకు రోడ్డు మీద శబ్ద కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఎలక్ట్రిక్ వాహనాల మీద దృష్టి కేటాయించాలన్నారు. ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు కూడా చర్చించుకుని ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ పోలీసు అధికారులకు సహకరించాలన్నారు. దాంతో సెవెన్ సీటర్స్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు, ట్రాక్టర్ అసోసియేషన్ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, ట్రాఫిక్ సీఐలు నర్సింగ్‌రావు, నర్సింహా నాయక్, సెవెన్ సీటర్స్ అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, ఫిబ్రవరి 7: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలివేస్తున్నట్లు ఆస్మాన్‌ఘడ్ డీఈఈ హనుమంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ సింగరేణికాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, 11కేవీ సరస్వతీనగర్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

డివిజన్ అభివృద్ధికి పెద్దపీట

- కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, ఫిబ్రవరి 7: డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో పూర్తి స్థాయి అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నానని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి తెలిపారు. బుధవారం హయత్‌నగర్ డివిజన్‌లోని సాయి కాలనీ ఫేజ్-2లో నూతనంగా చేపడుతున్న భూగర్భ డ్రైనేజీ పైపులైన్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో పూర్తి స్థాయి అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా పంపిణీపై అడుగడుగునా నిఘా

- అలసత్వం వహిస్తే చర్యలు

బడంగ్‌పేట, ఫిబ్రవరి 7: ప్రజా పంపిణీ వ్యవస్థలో అడుగడుగునా నిఘా పెట్టడం జరిగిందని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ తెలిపారు. మహేశ్వరం మండలం రావిర్యాలలో పౌర సరఫరాల గిడ్డంగిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిడ్ డే మీల్స్‌కు బియ్యంను చేరవేయడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. పాఠశాలలకు పంపాల్సిన బియ్యం తక్కువ పరిణామంలో ఉంటే ద్విచక్ర వాహనంపై తీసుకుపోవాలని ఆదేశించారు. ప్రతి నెల ఫౌర సరఫరాల సంస్థ గిడ్డంగుల నుంచి కోటి రూపాయలకు పైగా స్టాక్ దుకాణాలకు పంపడం జరుగుతుందన్నారు. వాహనాలను జీపీఎస్ సాంకేతికతతో అనుసంధానం చేయడం జరుగుతుందని రఘునందన్ రావు తెలిపారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

మన్సూరాబాద్, ఫిబ్రవరి 7: హయత్‌నగర్ పరిధి లెక్చరర్స్‌కాలనీలో ఓ వ్యక్తి రోడ్డును ఆక్రమించి ఫెన్సింగ్ వేశారని స్థానికులు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన సదరు నిర్మాణాన్ని ఈనెల 5న పరిశీలించి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ ఫిర్యాదు మేరకు బుధవారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ పావని ఆధ్వర్యంలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఫెన్సింగ్‌ను జేసీబీ సహాయంతో తొలగించారు. రోడ్డును ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ అధికారులు హెచ్చరించారు. వాహనదారులకు, ప్రజలకు ఇబ్బందులు సృష్టించే విధంగా నిర్మాణాలు చేపట్టవద్దని సూచించారు. రోడ్డు ఆక్రమణలు తొలగించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

లెక్చరర్స్‌కాలనీలో రోడ్డును ఆక్రమించి నిర్మించిన ఫెన్సింగ్‌ను కూల్చి వేస్తున్న దృశ్యం

ఇందిరమ్మ దశరథ ముదిరాజ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డి హరినాథ్‌రెడ్డి

పల్లె ప్రగతి దేశానికే ఆదర్శం

పదవికే విరమణ.. ప్రజాసేవకు కాదు: ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 7: విరమణ పదవికే కానీ ప్రజాసేవకు కాదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి తెలిపారు. ఐదేండ్ల కాలం దిగ్విజయంగా పూర్తి చేసుకున్న మండల సర్పంచ్‌లకు మండల సమావేశపు హాల్‌లో ఆత్మీయ వీడ్కోల సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను సన్మానించి మాట్లాడారు. ప్రగతి ఫలాలు పల్లెలకు చేర్చి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కృషితోనే తెలంగాణలో 20గ్రామాలకు అవార్డులు వచ్చినట్లు చెప్పారు. హరితహారంలో మొక్కలు నాటి హరిత విప్లవానికి నాంది పలికినట్లు చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మార్కెట్ చైర్మన్ సురుసాని సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ ముదిరాజ్, పీఏసీఎస్ చైర్మన్ దేవరశెట్టి చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సురుసాని రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి గుడిసెవాసులకు ఇండ్ల పట్టాలు ఇవ్వాలి

సింగరేణికాలనీలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న గుడిసెవాసుల సంక్షేమ సంఘం ప్రతినిధులు మోతిలాల్‌నాయక్, తుకారాం నాయక్, విక్రమ్ తదితరులు

సైదాబాద్, ఫిబ్రవరి 7: గుడిసెల్లో నివాసముంటున్న నిరుపేదలకు స్థానికంగా ఇండ్ల పట్టాలు ఇవ్వాలని సింగరేణికాలనీ గుడిసెవాసుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సింగరేణికాలనీ గుడిసెవాసులు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు కొర్ర మోతిలాల్‌నాయక్, తుకారాం నాయక్, విక్రమ్, సక్రి బాయి, ఏలూరు బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ మిగులు భూమిలో 30ఏండ్లుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న ప్రాంతాన్ని ఇండస్ట్రీస్ డిపార్టుమెంట్ హౌసింగ్ సొసైటీ పేరుతో తమను ఇక్కడి నుంచి ఖాళీ చేయించటానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమకు అన్ని మౌలిక వసతులను కల్పించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొంత మంది సొసైటీ పేరుతో అధికారులకు, ప్రభుత్వానికి తప్పుడు సమాచారం అందిస్తున్నారని విమర్శించారు. గుడిసెవాసులందరికీ ఇండ్ల పట్టాలు ఇవ్వాలంటూ రెండు వేల మందితో ప్రజా భవన్‌కు తరలివెళ్లి వినతి పత్రాన్ని అందిస్తామన్నారు. కొంత మంది బోగస్ సొసైటీ పేరుతో తమకు వ్యతిరేఖంగా కుట్రలు చేస్తున్నారని, తమకు ఇండ్ల పట్టాలు ఇచ్చేంతవరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం ప్రతినిధులు షేక్ మహబూబ్, బన్సీనాయక్, సద్దాంఖాన్, రవినాయక్, విజయ్, అంజయ్య, చందు, శాంతి బాయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల నూతన తరగతి గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్

మైలార్‌దేవ్‌పల్లి, ఫిబ్రవరి 7: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పద్మశాలిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో వి-డ్రీమ్, నిర్మాణ్ సంస్థల సౌజన్యంతో రూ.36లక్షలు వెచ్చించి అదనపు తరగతి గదులు, ప్రహరీని నిర్మించారు. బుధవారం ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సంస్థలు ముందుకు వచ్చి పేద విద్యార్థులు చదువుకునేందుకు పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యార్థులకు ఉత్తమ విద్యాబుద్ధులు నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు బోధించే పాఠాలను శ్రద్ధగా విని నేర్చుకోవాలన్నారు. ఏమైనా పాఠాలు అర్థంకాకపోతే అప్పుడు నివృత్తి చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద విద్యార్థులే ఎక్కువగా విద్యాభ్యాసం నేర్చుకుంటున్నారన్నారు. విద్యార్థులు బాగా చదువుకుంటేనే భవిష్యత్తు బాగుంటుందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందిస్తున్నానన్నారు. విద్యార్థులకు ఎక్కడ ఎలాంటి సమస్యలు ఏర్పడినా తన దృష్టికి తీసుకువస్తే వాటికి పరిష్కారాలు చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వి-డ్రీమ్ ప్రతినిధి కిమ్యాను, నిర్మాణ్ సంస్థ ప్రతినిధి అనురాధ, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ప్రేమ్‌గౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాలనీల అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్

లక్ష్మీనగర్ కాలనీలో థీమ్ పార్క్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

సైదాబాద్, ఫిబ్రవరి 7: రాజకీయాలకు అతీతంగా కాలనీల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తానని యాకుతీపురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మెరాజ్ తెలిపారు. బుధవారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనగర్ కాలనీలో రూ.2కోట్ల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన మల్టీ జనరేషన్ థీమ్ పార్కును స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించటానికి.. అసెంబ్లీ సమావేశాలు ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రజా సమస్యలను పరిశీలిస్తామన్నారు. గత నెలలో ప్రెస్ కాలనీలో జరిగిన అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి హాజరైన హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తన బడ్జెట్ నుంచి రూ.30లక్షలు కేటాయించారని, తక్షణమే పరిష్కరించాల్సిన పనుల వివరాలను తన దృష్టికి తీసుకొస్తే.. పరిష్కారానికి నిధులు మంజూరు చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. పలు కాలనీల్లో ఇప్పటికే మంజూరైన పనులు మొదలు పెట్టేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఐఎస్ సదన్ కార్పొరేటర్ జంగం శ్వేత మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అనేక కాలనీల్లో రోడ్లు పాడవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పరిష్కరించాలని కోరారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలతోపాటు అందరికీ ఎంతో ఉపయోగకరంగా పార్క్ ఉంటుందని, పార్క్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలన్నారు. వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యే జఫర్ హుస్సేన్‌ను కలిసి కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించి వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ సంతోష్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నాగమణి, ఏఈ అన్సారీ, హార్టికల్చర్ డీడీ అమీనా బేగం, మేనేజర్ యమున, ఐశర్య, లక్ష్మీనగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రవీందర్ రెడ్డి, కాలనీ హౌసింగ్ సొసైటీ ప్రతినిధులు బాలకృష్ణ గౌడ్, ప్రపుల్ల కుమార్, శ్రీనివాస్, భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన క్రీడాకారులతో డాక్టర్ సుమన్ తల్వార్, సయ్యద్ ఇఫ్తేకార్ హుస్సేన్.

7వ అంతర్జాతీయ కరాటే పోటీలో నగర క్రీడాకారుల హవా

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 7: విశాఖపట్టణంలోని రాజీవ్ గాంధీ పోర్ట్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 7వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో పాకో మార్షల్ ఆర్ట్స్ అకాడమీకి చెందిన 23 మంది క్రీడాకారులు మెడల్స్‌ను సాధించారు. 7వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో బాలురు-బాలికలు, పురుషులు-మహిళలకు వివిధ విభాగాలో 6 దేశాల నుంచి 1277 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. సుప్రీం మార్షల్ యాక్టర్ డాక్టర్ సుమన్ తల్వార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారని, షిహాన్ హైదర్ అలీ, షిహాన్ తాజుద్దీన్ బాను పోటీలను నిర్వహించారని అకాడమీ టెక్నికల్ డైరెక్టర్ సయ్యద్ ఇఫ్తేకార్ హుస్సేన్ తెలిపారు.

పస్మాంద ముస్లింల సమస్యలు పరిష్కరించాలి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 7: పస్మాంద ముస్లింలు రాష్ట్రంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కంటే చాలా వెనుకబడి ఉన్న అత్యంత అణగారిన వర్గాలని అఖిల భారత పస్మాంద ముస్లిం మహజ్(ఏఐపీఎంఎం) రాష్ట్ర అధ్యక్షుడు అద్నాన్ కమర్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో జరిగిన ఏఐపీఎంఎం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా అద్నాన్ కమర్‌ను నిమయమించారు. ఈ సందర్భంగా దేశం నలుమూలల నుంచి వైస్ చాన్స్‌లర్లు, మాజీ ఐఏఎస్ అధికారులు, మేధావులు, బీజేపీ మంత్రులను ఆహ్వానించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అద్నాన్ కమర్ మాట్లాడుతూ.. సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన తమ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాతినిధ్యం లేదన్నారు. పస్మాంద వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు ముందుకు వచ్చి సహకరించాలని కోరారు.

ఏఐపీఎంఎం రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపికైన అద్నాన్ కమర్‌తో జాతీయ అధ్యక్షుడు పర్వేజ్ హనీఫ్, మాజీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ మసూద్ ఆలం ఫలహాయి, యూపీ మంత్రి డానిష్ ఆజాద్ అన్సారీ

పాత మలక్‌పేట డివిజన్‌లోని వాహెద్‌నగర్‌లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

దోమల నివారణకు చర్యలు

మలక్‌పేట, ఫిబ్రవరి 7: దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉండే పాత మలక్‌పేట డివిజన్‌లోని మూసీ పరీవాహక ప్రాంతం పొడవునా అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టారు. డివిజన్ పరిధిలోని పద్మానగర్, శంకర్‌నగర్, హౌజింగ్‌బోర్డు కాలనీ, పాపయ్య బస్తీ, వాహెద్‌నగర్, తీగలగూడ, అప్జల్‌నగర్, సలీంనగర్ కాలనీల్లో ఎంటమాలజీ సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. మురికినీటి గుంతల్లో లార్వా నివారణ మందులను పిచికారీ చేశారు. కాలనీల్లో అపరిశుభ్రతకు తావులేకుండా పారిశుధ్యం చేయించారు. వారానికోసారి ఫాగింగ్, లార్వా నివారణ రసాయనాలను పిచికారీ చేయిస్తున్నట్లు డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు సైఫుద్దీన్(షఫీ) తెలిపారు.

అయోధ్యకు భక్తులు

అయోధ్యలో బాలరాముడి దర్శనానికి హైదరాబాద్ నుంచి అయోధ్యకు 14 వందల మందితో వెళ్తున్న ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి. చిత్రంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ రెడ్డి, రామకృష్ణ తదితరులు – సైదాబాద్, ఫిబ్రవరి 7